ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక





పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
ప్రభాత ఉదయం
మహా శివరాత్రి శుభాకాంక్షలు
ఎం.దామోదర్ రెడ్డి
ఎడిటర్-ప్రభాత ఉదయం



సంపుటి: 2 | సంచిక: 320 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 26 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా
# హైదరాబాద్




**ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా తెలంగాణ**
**లైఫ్ సైన్సెస్ రంగంలో గణనీయమైన ప్రగతి**
**బయో ఏషియా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** ప్రతి ఏటా నిర్వహించే బయో ఏషియా సదస్సు హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలబెట్టిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హెల్త్ కేర్ రంగం భవిష్యత్ నిర్దేశించటంతోపాటు ప్రపంచానికే మార్గదర్శనం చేసేలా బయో ఏషియా దేశ విదేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఫార్మా, హెల్త్ కేర్, లైఫ్ సైన్స్, బయోటెక్ కంపెనీలు ఎన్నో హైదరాబాద్ నుంచి పనిచేస్తున్నాయని సీఎం చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఏషియా-2025 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను అందించే సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. మేము ఇంతకాలం ఉన్నత విద్యపై పెట్టుబడులు పెట్టాం. ఎందరో శాస్త్రవేత్తలు, శాస్త్ర, సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సమూహాన్ని తయారు చేశాం. జీనోమ్ వ్యాలీని కూడా ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియా సేవల రంగానికి ప్రాధాన్యమిస్తాం. హైదరాబాద్ లో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీతోపాటు ఎన్నో భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాం. దేశంలో ఇప్పుడు హైదరాబాద్ ఎలక్ట్రిక్ వాహనాల రాజధానిగా అవతరించింది. దేశంలోనే అత్యధిక ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. 3,000 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెడుతున్నాం. కోర్ సిటీ వెలుపల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకూ మాన్యుఫ్యాక్షరింగ్ హబ్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచంలోని అతిపెద్ద తయారీ కేంద్రాలలో ఒకటిగా దీన్ని నెలకొల్పుతాం. ప్రపంచం నలుమూలాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్.. ఈ రెండు రింగ్‌లను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం. ఈ రహదారులకు ఇరువైపులా క్లస్టర్లను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ భూ పరివేష్టిత

..మిగతా 2లో



### తెలంగాణకు ఎక్కడ అడ్డుపడ్డానో
## రుజువు చేయగలవా
### సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** రేవంత్ రెడ్డికి దమ్ము ఉంటే తాను ఎప్పుడు ఎక్కడ తెలంగాణకు అడ్డుపడ్డానో రుజువు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పదవుల కోసం పార్టీలు మారి కాళ్లు పట్టుకొనే వాడిని తాను కాదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం రేవంత్ చేతిలో ఉంది.. ఆయన ఎలాంటి విచారణ చేస్తారో చేసి తమకు అప్పగించాలని కిషన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేయడం వల్లనే తాను గట్టిగా సమాధానం ఇవ్వాల్సి వస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తన రాజకీయ జీవితంలో ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని స్పష్టం చేశారు. దేశం మీద భక్తితో, జెండా మీద గౌరవంతో బీజేపీలో మాములు కార్యకర్తగా వచ్చి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న తనను పట్టుకొని తెలంగాణకు అడ్డుపడ్డ వ్యక్తి అంటూ మాట్లాడటం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

### సర్వాంగ సుందరంగా
## వేములవాడ
### శివరాత్రి జాతరకు ప్రత్యేకంగా ముస్తాబు



**వేములవాడ, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. శివరాత్రి సందర్భంగా 3 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. స్థానిక ఎమెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు పర్యవేక్షించారు. శివరాత్రి సదర్భంగా రాత్రి 9 గంటలకు నిశిపూజ, అనంతరం మహాశివరాత్రి పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఏటా శిరాత్రి జాగారం కోసం వేలాదిగా భక్తులు తరలివస్తారు. వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇవో తెలిపారు. అలాగే రాజన్నను దర్శించుకునే భక్తులు రాజన్న ప్రసాదాలపై అంతే మక్కువ చూపుతారు. మహాశివరాత్రి జాతరకు

..మిగతా 2లో



### ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడితే
## రాజీనామా చేస్తారా
### ఈ ఎన్నికలను రెఫరెండంగా తీసుకుంటారా
### సిఎం రేవంత్‌రు
### ఎంపి రఘునందన్ రావు సవాల్

**సిద్దిపేట, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే రాజీనామాకు రేవంత్ రెడ్డి సిద్ధమా అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సవాల్ విసిరారు. పని చేశా.. ఓటు వేయమంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను తన పాలనకు రెఫరెండంగా తీసుకుంటారా అని ప్రశ్నించారు. మంగళవారం రఘునందన్ రావు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికలతో తమ ప్రభుత్వానికి

..మిగతా 2లో



### ఎన్ని కుట్రలు చేసినా జనం గుండెల్లో
## నిలిచేది బీఆర్ఎస్సే
### బీఆర్ఎస్ లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు
### హామీల పేరుతో గద్దెనెక్కి.. మాటమార్చిన రేవంత్
### కాంగ్రెస్ అంటేనే కరువు : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** రాష్ట్రంలో బీఆర్ఎస్ లేకుండా బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి కుట్రలు పన్నుతున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కానీ వారు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల గుండెల్లో నిలిచేది బీఆర్ఎస్సే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల వివాహాలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. రూ. 15 వేలు రైతు భరోసా, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తా అని మాయ మాటలు చెప్పారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 450 రోజులు అవుతుందని.. రోజుకు ఒకరి చొప్పున 450 మంది రైతులు ఆత్మహత్య చేసుకుకున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా తగ్గించింది కేసీఆర్ ప్రభుత్వం అని కేంద్రం పార్లమెంట్‌లో చెప్పిందని గుర్తు చేశారు. మరి కాలం తెచ్చిన కరువా..? కాంగ్రెస్ తెచ్చిన కరువా? అర్థం చేసుకోవాలన్నారు. కేసీఆర్ మీద కోపంతోనే మేడిగడ్డ రిపేర్ చేయడం లేదని ఆరోపించారు. శివుడు గంగను కిందకు తీసుకువస్తే.. కేసీఆర్ గంగను పైకి తెచ్చిందని

..మిగతా 2లో

## గల్లంతైన వారి రక్షణకు చర్యలు
### ప్రమాదవశాత్తు ఘటనలపై విమర్శలు తగవు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**నల్లగొండ, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తుంది. టన్నెల్‌లో గల్లంతైన ఎనిమిది మంది ఆచూకీపై ఇంకా స్పష్టత లేదు. రెస్క్యూ టీమ్స్ పలుమార్లు టన్నెల్‌లోకి వెళ్లి ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తిరిగి వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రెస్క్యూ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తిరిగి తీసుకురావడానికి సర్వ శక్తులా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో అత్యంత నిపుణులైన 10 ఏజెన్సీలు ఈ రెస్క్యూలో పనిచేస్తున్నాయి.. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, జియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ అన్నీ కలిసి పనిచేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు ఆరా

..మిగతా 2లో




## ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలమాట ఏమైంది?
### చెప్పుకోవటానికి ఒక్కటైనా ఉందా..?
### మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదు
### మతం పేరు లేకుండా బండి ఒక్కమాట మాట్లాడలేడు : సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం):** మత రాజకీయాలు తప్ప బీజేపీకి ఏమీ చేతకాదని మంత్రి సీతక్క అన్నారు. బీజేపీ టీం ఇండియా, కాంగ్రెస్ పాకిస్తాన్ అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒకటి కూడా బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అని చెప్పి జిల్లాకు 200 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు యువకులకు జవాబు చెప్పుకోక మత రాజకీయాలకు బండి సంజయ్ పాల్పడుతున్నారని ఆగ్రహించారు. చెప్పుకోవడానికి అభివృద్ధి లేదని.. సబ్జెక్టు అంతకన్నా లేదన్నారు. అందుకే బండి సంజయ్ నోరు తెరిస్తే

..మిగతా 2లో





# గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రం. ఒక మెగా డ్రై పోర్టును అభివృద్ధి చేసి ఏపీలోని సీ పోర్టుకు అనుసంధానించేందుకు ప్రత్యేక రైలు, రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపరుస్తాం. బయోసైన్సెస్, బయోటెక్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ వ్యవస్థకు చిరునామాగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి, తయారీ, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం. నిన్ననే హైదరాబాద్‌లో ఆమ్జెన్ సంస్థ తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది మా సహకారానికి నిదర్శనం. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, మా ప్రభుత్వ సహకారాన్ని అందుకోవాలని, మాతో భాగస్వామ్యం పంచుకోవాలని ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు అన్నింటినీ ఆహ్వానిస్తున్నాం. సులభమైన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాలు, ఆశించినంత మద్దతు అందించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దేశ విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది. ఇక్కడ అత్యల్ప ద్రవ్యోల్బణం, అత్యధిక ఉద్యోగాల కల్పన ఉంది. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికలోనూ తెలంగాణ రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది. విభిన్న రంగాలలో దాదాపు 50,000 ఉద్యోగాలు రానున్నాయి. గతేడాది లైఫ్ సైన్సెస్ రంగంలోనూ రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులను విజయవంతంగా ఆకర్షించాం. దాదాపు 150పైగా ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులు విస్తరించాయి. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఫార్మా గ్రామాలు అభివృద్ధి చేస్తున్నాం. ఐదు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాలని ఆశిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ కింద కీలకమైన గ్రీన్ ఫార్మా సిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతిపెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలు అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయి. జర్మన్ కంపెనీ మి÷-టలెని బయోటెక్ జీనోమ్ వ్యాలీలో తన సెల్, జన్యు చికిత్సను ప్రారంభించింది. ఈ వేదిక పైనుంచి మరో నాలుగు బహుళజాతి కంపెనీలను మా పర్యావరణ వ్యవస్థలోకి స్వాగతిస్తున్నాం. 25 సంవత్సరాల్లో ఫార్మా తయారీ, ఐటీ, డిజిటల్ హెల్త్ పవర్ హౌస్‌గా హైదరాబాద్ పేరు నిలుపుకుంది. గతేడాది ఏఐ హెల్త్‌కేర్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించాం. దేశవిదేశాల నుంచి బయో ఏషియా సదస్సుకు హాజరైన ప్రముఖుల గొప్ప మనస్సుకు అభినందనలు. మీరందరూ తెలంగాణను అనువైన వేదికగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా. జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డ్ పొందిన ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని' చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని కుట్రలు చేసినా జనం గుండెల్లో నిలిచేది బీఆర్‌ఎస్సే

మొదటి పేజీ తరువాయి...

పేర్కొన్నారు. కానీ రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు కొల్లగొట్టారు అని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరంలో ఒక బ్యారేజ్‌లో ఒక పర్రె వడితే.. దానికి కాంగ్రెస్ నేతలతో పాటు మీడియా ప్రతినిధులు కూడా లొల్లి పెట్టిండ్రు. మరి ఇవాళ సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే ఎవరు మాట్లాడరు. కాంగ్రెస్, బీజేపోడు నోరెత్తడు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోతే మాట్లాడరు. ఖమ్మం వద్ద పెద్దవాగు కొట్టుకుపోతే ఎవరు మాట్లాడరు. రేవంత్ రెడ్డికి రక్షణ కవచంలా బీజేపీ ఉంది. కాళేశ్వరంలో ఒక పిల్లర్‌కు పర్రె వడితే.. ఎన్డీఎస్ఏ వాలిపోయింది. మరి ఇవాళ ఎస్ఎల్‌బీసీలో టన్నెల్ కూలి దాదాపు 72 గంటలు అవుతుంది మరి ఎందుకు ఎన్డీఎస్ఏ రాలేదు. ఏ బీజేపోడు మాట్లాడడు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడం లేదు. ఏం ఇబ్బంది వచ్చింది. సుంకిశాల కూలిపోతే గవినోళ్ల శ్రీనివాస్ ఆర్టీఐ కింద రఖాస్తు పెట్టుకుంటే.. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. సమాధానం ఇవ్వమని చెప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండే కాదు.. ఎన్నికల ప్రచారంలో మోదీ వచ్చి.. కాంగ్రెస్ పార్టీ అవినీతి ప్రభుత్వాన్ని నడుపుతుంది.. ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాని గర్జించిండు. కానీ ఇంత వరకు చర్య లేదు. రేవంత్ రెడ్డి బామ్మర్ది కంపెనీ శోధా 2 కోట్ల లాభం ఆర్జించింది. అమృత్ స్కీంలో రూ. 1137 కోట్ల కాంటాక్ట్ ఇచ్చిండు బామ్మర్ది కంపెనీకి రేవంత్ రెడ్డి. దీని మీద విచారణ చేయాలని సంబంధిత కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరు నెలలు అవుతంది.. ఇప్పటి వరకు స్పందన లేదు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ రైడ్ అయింది.. ఏం జరిగిందో తెలియదు కానీ ఇప్పటి వరకు ఎవరూ నోరు విప్పడం లేదు. ఇవన్నీ దేనికి సంకేతం.. ఎవరు ఎవర్ని కాపాడుతున్నారు. రేవంత్ రెడ్డి బీజేపీ మీద పల్లెత్తు మాట మాట్లాడం లేదు. కేసీఆర్ మీదనే మాట్లాడుతున్నడు. ఈ రాష్ట్రంలో కేసీఆర్ పార్టీ ఉంటే.. కాంగ్రెస్, బీజేపీ ఆటలు సాగవని తెలుసు కాబట్టి.. ఆ ఇద్దరు కలిసి కేసీఆర్ పార్టీని ఖతం చేయాలన్నదే ఆలోచన. అసెంబ్లీ ఎన్నికల్లో కుమ్మక్కై సక్సెస్ అయ్యారని కేటీఆర్ తెలిపారు.





## గల్లంతైన వారి రక్షణకు చర్యలు

మొదటి పేజీ తరువాయి...

తీస్తున్నారు.. ప్రమాదం జరిగిన వెంటనే వేగంగా స్పందించామని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ చేసే అనుభవం ఉన్న వాళ్ళను కూడా ఆహ్వానిస్తున్నాం.. మేము ఇంత చేస్తుంటే.. కొందరు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు. కాళేశ్వరంలో ఏడుగురు చనిపోతే మేము మాట్లాడలేదు.. శ్రీశైలం పవర్ ప్లాంట్ లో కూడా ఎనిమిది మంది చనిపోతే కూడా ఏనాడు మాట్లాడలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన ప్రమాదం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్టు ఇది.. 45 కి.మీలలో 30 కి.మీ పూర్తి అయ్యిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు మినిమం సెన్స్ లేకుండా మాట్లాడుతున్నాయి.. ప్రాజెక్ట్ పూర్తి ఐతే నల్గొండ జిల్లాలో లక్షల ఎకరాలకు నీరు అందుతుంది.. ఫ్లోరైడ్ బాధ తొలుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ పనులు నిలిపివేశారని మంత్రి ఆరోపించారు. మరోవైపు.. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడటానికి సర్వ శక్తులా కృషి చేస్తున్నాం.. ప్రమాదం జరిగిన స్థలంలో నీరు లీక్ అవుతోంది.. నీటి ఉధృతి కూడా పెరిగిందని రెస్క్యూ టీమ్స్ చెప్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# మరోసారి టన్నెల్‌లోకి ర్యాట్ హోల్ మైనర్స్




**జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ సాయం కోరిన రాష్ట్రం**
**సొరంగ మార్గంలో చిక్కుకుపోయిన 8 మందిని రక్షించేందుకు ప్రభుత్వం సహాయక చర్యలు**
**రంగంలోకి దిగిన కేంద్ర బలగాలు**
**ప్రయోగాత్మకంగా ప్రమాద స్థలికి చేరుకునే అవకాశాలను పరిశీలించిన నేవీ, ఎన్డీఆర్ఎఫ్**

శ్రీశైలం, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో చిక్కుకుపోయిన 8 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు మరింత ముమ్మరమయ్యాయి. నీరు, బురద రూపంలో అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రభుత్వం అన్వేషిస్తోంది. సొరంగంపై నుంచి లేదా పక్క నుంచి లోపలికి వెళ్లే అవకాశాలపై జియాలాజికల్ సర్వే అఫ్ ఇండియా, ఎన్‌జీఆర్ఐ నిపుణుల సాయాన్ని కోరింది. వారి నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లనుంది. ఇండియన్ నేవీ, ఎస్డీఆర్ఎఫ్ ఇవాళ ప్రయోగాత్మకంగా ప్రమాద స్థలికి చేరుకునే అవకాశాలను పరిశీలించి ఇవాళ నుంచి రంగంలోకి దిగనున్నారు.

**అడ్డంకిగా టీబీఎం అవశేషాలు:**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గంలో 8 మంది చిక్కుకున్న ప్రాంతానికి వెళ్లేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఇండియన్ నేవీ, ఇండియన్ ఆర్మీ, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ సహా పలు సహాయక బృందాలు లక్షిత ప్రదేశాన్ని చేరుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాయి. ఇప్పటి వరకూ పదమూడున్నర కిలోమీటర్ల వరకూ మాత్రమే సహాయక బృందాలు చేరుకోగలుగుతున్నాయి. అక్కడ ధ్వంసమైన టీబీఎం అవశేషాలు అడ్డంకిగా మారాయి.

**వెళ్లలేకపోతున్న సహాయక బృందాలు :**

పది నుంచి పదకొండున్నర కిలోమీటర్ల వరకూ రెండు అడుగుల ఎత్తులో నీరుంది. టీబీఎం మిషన్ దాటిన తర్వాత 100 మీటర్ల మేర లోతైన బురద పేరుకుపోయి ఉంది. అక్కడ వరకూ వెదురు బొంగులు, థర్మాకోల్ షీట్స్‌తో చేసిన ఫిషింగ్ బోట్లు ఉపయోగించి సహాయక బృందాలు వెళ్లగలుగుతున్నాయి. ఆ తర్వాత దట్టమైన బురద సుమారు ఆరేడు అడుగుల ఎత్తులో పేరుకుపోయి ఉంది. ఆ అడ్డంకిని దాటితేనే ప్రమాదానికి గురైన టీబీఎం ముందు భాగం, అందులో చిక్కుకుపోయిన 8 మందిని గుర్తించే అవకాశం ఉంది. ఆ ప్రాంతానికి సహాయక బృందాలు వెళ్లలేకపోతున్నాయి. పుషింగ్ కెమెరాలు, డ్రోన్లు, సిగ్నలింగ్ వ్యవస్థ ఎన్ని ఏర్పాట్లు చేసిన ఫలితాలు రావడం లేదు. 40 మీటర్ల బురదను దాటి టీబీఎం వరకూ చేరుకోలేక పోయిన ర్యాట్ హోల్ మైనర్స్ ఎలాగైనా అక్కడకు చేరుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్‌జీఆర్ఐ నిపుణుల సాయం :**

ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకునేందుకు సొరంగం పై నుంచి కానీ, పక్క నుంచి గాని వెళ్లే మార్గాలను అన్వేషిస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు ఇవాళ సహాయక బృందాలతో రెండు సార్లు సమీక్షలు నిర్వహించారు. జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఎన్జీఆర్ఐ నిపుణుల సాయాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. కొంత ఆలస్యమైనా ప్రాజెక్టును తిరిగి చేపట్టాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయాలని భావించే వాళ్లు విమర్శలు మానుకోవాలన్నారు.

**సహాయక చర్యలపై సంతృప్తి**

సొరంగ మార్గంలో చిక్కుకుపోయిన ఝూరండ్‌కు చెందిన నలుగురు కార్మికులు సందీప్ సాహు, జగ్తా జెస్, సంతోష్ సాహు, అంజూ సాహు కుటుంబ సభ్యులు సైతం ఎస్ఎల్ బీసీకి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన రోజునే తమకు సమాచారం అందిందని జిల్లా యంత్రాంగం అన్ని ఖర్చులు భరించి తమను ఇక్కడకు తీసుకువచ్చిందని చెప్పారు. కొనసాగుతున్న సహాయక చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లో 17 రోజుల తర్వాత 41 మందిని సురక్షితంగా సహాయక చర్యలు చేపట్టి రక్షించారని సహాయక చర్యలు సఫలమైతే తమ కుటుంబ సభ్యులు సైతం ప్రాణాలతో బయట పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుండటంతో రెస్క్యూ బృందాలు తప్ప ఇతరులకు టన్నెల్‌లోకి ప్రవేశాన్ని నిషేధించారు.

## సర్వాంగ సుందరంగా వేములవాడ

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి మూడు నుంచి నాలుగు లక్షల మంది వస్తారన్న అంచనాలో అధికార యంత్రాంగం ఉంది. భక్తులకు రాజన్న లడ్డూ ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేసారు. పెద్ద ఎత్తున లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు స్వామివారి ప్రసాదం అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మహాజాతర కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా రాజరాజేశ్వరస్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. యాత్రికుల సౌకర్యార్థం ఆలయ అధికారులు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేశారు. గతంలో ఎదురైన అనుభవాలను దృష్ట్యా మెరుగైన ఏర్పాట్లు చేపట్టాలనే లక్ష్యంతో పనులను దాదాపుగా పూర్తి చేశారు. ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. వివిధ ప్రాంతాలలో బాధ్యతలు కేటాయించారు. జాతర ఉత్సవాలలో పాల్గొనే భక్తుల వసతి సౌకర్యం కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచారు. పారిశుధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఆలయ పారిశుధ్య సిబ్బందితోపాటు తాత్కాలికంగా ఇతర ప్రాంతాల నుంచి పారిశుధ్య కార్మికులను రప్పించింది. చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసింది. పోలీసు అధికారులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. రాజరాజేశ్వరస్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ అధికారులతోపాటు రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, సెస్, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, అగ్నిమాపక విభాగం తదితర ముఖ్య శాఖల అధికారులు ఏర్పాట్లలో పాలుపంచుకున్నారు. జాతర ఉత్సవాల్లో ఇబ్బంది లేకుండా జరగడానికి వీలుగా ప్రత్యేక అధికారులను నియమించి ప్రాంతాలు, అంశాల వారీగా బాధ్యతలు కేటాయించారు. యాత్రికులకు వసతి సౌకర్యం, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, బందోబస్తు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరకు వచ్చే భక్తులకు సమాచారం తెలియడానికి వీలుగా పట్టణంలో పలు చోట్ల జాతర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు, చిత్రాలతో కూడిన మ్యాపుల ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడకు చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ సంస్థ హైదరాబాద్, వరంగల్, నర్సంపేట, కోరుట్ల మెట్‌పల్లి, ఆర్మూర్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కొండగట్టు తదితర ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడితే రాజీనామా చేస్తారా

మొదటి పేజీ తరువాయి...

వచ్చేది లేదు.. పోయేది లేదు అంటున్న కాంగ్రెస్ నేతలు ఎందుకు పోటీ చేస్తున్నారని నిలదీశారు. కార్ రేస్ కేసులో నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఏసీబీ రేవంత్ ప్రభుత్వం కంట్రోల్‌లో పని చేసేదే కదా అరెస్ట్ ఎందుకు చేయించడం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు అంటున్న సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఆధారమైనా చూపించాలని ఛాలెంజ్ చేశారు. పాత సీఎస్ సోమేష్ కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని చెప్పిన వాళ్లు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రింగురోడ్డు టోల్ గేట్ కుంభకోణంలో రేవంత్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రఘునందన్ రావు ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట కొండా భూదేవి గార్డెన్‌లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలుపును ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పారు. ఇద్దరు బీజేపీ అభ్యర్థులు మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలుస్తారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. మిగతా పార్లమెంట్‌లలో కంటే మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువ ఓట్లు సాధిస్తామని అన్నారు. గతంలో గెలిచిన నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ పంచన చేరారు, కానీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. ఇతర పార్టీలో నాయకులను కొన్నట్లుగా బీజేపీ పార్టీ నాయకులను కొనలేరని మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఉద్ఘాటించారు. బీసీలలో ముస్లింలను రేవంత్ రెడ్డి కలిపారని ఆరోపించారు. నూటికి 55శాతం బీసీలు ఉంటే వారికి ఉన్న వాటా ప్రకారం మంత్రి పదవులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా బీసీని ఎందుకు సీఎం చేయలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేంద్రమంత్రి పదవుల్లో బీసీలకు మోదీ పెద్దపీట వేశారని చెప్పారు. ఒక్క మైనార్టీకి కూడా కాంగ్రెస్ మంత్రి పదవి ఇవ్వలేదని అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదని చెప్పారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ముందుగా ధామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్నటి సభలో బీజేపీ గెలుస్తుందని చెప్పకనే చెప్పారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 14నెలల్లోనే ప్రజల విశ్వాసాలను కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. తన కోసం మూడు రోజులు కష్టపడితే తాను ఆరేళ్లు మీ కోసం కష్టపడతా నిరుద్యోగులకు అండగా ఉంటానని మాటిచ్చారు. ఎమ్మెల్సీ జీతం నుంచి వచ్చే డబ్బులను పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి హామీ ఇచ్చారు.

## ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలమాట ఏమైంది?

మొదటి పేజీ తరువాయి...

హిందూస్తాన్, పాకిస్తాన్, హిందూ, ముస్లిం తప్ప మరో మాట తెలియదని విరుచుకుపడ్డారు. 'సూటిగా బండి సంజయ్‌ను అడుగుతున్నా... పట్టభద్రులకు మీరేం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదు. తెలంగాణ రాష్ట్రంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంత ఉపాధి కల్పించారు? ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మారు. ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. దేవుని పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ... దేవునికి వినియోగించే అగర్బత్తిల మీద కూడా జీఎస్టీ వేసింది. ఉన్నత విద్య మీద 18% జీఎస్టీ విధిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతుంది. అలాంటి బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు. తెలంగాణ విభజన హామీలు అమలు కాలేదు. ఎన్నికలప్పుడే హిందూ ముస్లిం అని రెచ్చగొడతారు. బండి సంజయ్.. పాకిస్తాన్‌తో పోల్చి భారతదేశం గొప్పతనాన్ని తగ్గించొద్దు. పాకిస్తాన్‌తో పోల్చి దేశాన్ని కించపరచడం తప్ప మీరు దేశానికి చేసింది లేదు. దమ్ముంటే అభివృద్ధి ప్రాతిపదికన ఎన్నికల్లోకి రండి" అంటూ సవాల్ విసిరారు. ట్రైబల్ యూనివర్సిటీ పనులు కూడా మొదలుపెట్టలేనీ అసమర్థ కేంద్ర ప్రభుత్వం అంటూ విమర్శించారు. బండి సంజయ్‌కు చెప్పుకోవడానికి ఏం లేదని.. మాట్లాడడానికి రెండు మాటలు రావన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనుకుంటే.. భారత సరిహద్దుల్లో ఉన్న సైనికుల మాదిరిగా యుద్ధంలో పాల్గొనాలని ఉచిత సలహా ఇచ్చారు. ఆకలి చావులు అంతర్గత సమస్యలతో దివాలా తీసిన పాకిస్తాన్‌తో పోల్చి.. దేశాన్ని అవమానపర్చవద్దన్నారు. పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని బండి సంజయ్ తగ్గిస్తున్నారని.. దేశ గౌరవాన్ని తగ్గిస్తున్న బండి సంజయ్‌ను బీజేపీ పెద్దలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. "భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన భారతీయులంతా నా సోదరులే అన్న మీరు భారత రాజ్యాంగాన్ని కాపాడతానని చెప్పిన మీరు.. అధికారం కోసం విద్వేష ప్రసంగాల అవసరమా. మీరు చేసింది శూన్యం. పట్టభద్రులారా ఆలోచించండి విద్యా వేత్త నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించండి. సంవత్సరకాలంలో 54 వేల ఉద్యోగాలు ఇచ్చాం. నరేందర్ రెడ్డిని గెలిపించి పనిచేసే ప్రభుత్వాన్ని సపోర్ట్ చేయండి. భావోద్వేగాలతో రాజకీయాలు చేసే బండి సంజయ్‌కు, బీజేపీకి గట్టిగా బుద్ధి చెప్పండి" అంటూ పిలుపునిచ్చారు. యువతను మత కొట్లాట వైపు మళ్లించి కేసులు నమోదు చేయించడమే బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ దొందూ దొందే అని అన్నారు. జటిలమైనా ఎన్నో సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. భారతదేశంలో యుద్ధ వాతావరణం సృష్టించే ప్రయత్నం మానుకోవాలని.. ఈ చిల్లర మాటలు మానేయాలని హితవుపలికారు. ఇలాంటి విద్వేషాపూరిత ప్రసంగాలు భారతీయుల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ పాకిస్తాన్‌తో భారతదేశాన్ని పోల్చి దేశ గౌరవాన్ని కించపరుస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాలతో మనం పోల్చుకోవాలని మంత్రి సతీక్క వ్యాఖ్యలు చేశారు.

# గుర్తుకొస్తున్నా(యి)రు

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న స్నేహితులందరితో ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయగా ఆనాటి స్నేహితులందరూ తమ మధుర జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. 40 సంవత్సరాల తర్వాత స్నేహితులందరూ ఇలా కలుసుకోవడం సంతోషం అనిపించింది. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు గుర్తుకొస్తున్నారు. ఒకటి, రెండో తరగతులలో రాబీయ టీచర్, కాలేజ టీచర్ ప్రేమగా చెప్పిన పాఠాలు మదిలో నేటికీ మెదులుతున్నాయి. డ్రాయింగ్ మాస్టారు యాదగిరి సారు చార్ట్ ల పైన వేసే డ్రాయింగ్ అర్థం కాక పోయినా చూసి సంతోషించే రోజులు కళ్ళ ముందు కదలాడుతున్నాయి. 3వ తరగతిలో ధనవరం టీచర్ కారు షెడ్డులో కూర్చో బెట్టి చెప్పిన పాఠాలు ఇంకా గుర్తుకున్నాయి. నాలుగో తరగతిలో నసీరుద్దీన్ ఖాన్ సార్ అటెండెన్స్ తీసుకోవడం, ఆఫీస్ కు వెళ్ళి అడ్మిషన్ పనులు చూసుకోవడం ఆ రోజుల్లో సాదారణమే. నసీరుద్దీన్ ఖాన్ సార్ చేతి వ్రాత ముత్యాల లాగా ఎంతో చక్కగా ఉండేది. చెట్ల కింద కూర్చోబెట్టి ధనపాల్ కిష్టయ్య సార్ 5వ తరగతి లో ఎఫ్ ఐ ఎస్ హెచ్ ఫిష్ అని నేర్పిస్తున్న ఇంగ్లీష్ అక్షరాలు నేటికీ గుర్తున్నాయి. 6వ తరగతిలో రాజ్ కిషోరీ టీచర్ ఆప్యాయంగా పలకరించే మాటలు, భాస్కరమణి టీచర్ విద్యార్థులను భయపెట్టే మాటలు, తరగతి గదిలో ఒక్కరు మాట్లాడిన అందరి తలలపైన కొట్టే అమర్ సార్ కోపం, రాధా కిషన్ సార్ ఇంగ్లీష్ నానిటేల్ చెపుతుంటే ఒక్కసారి వింటే అర్థమయ్యే బోధనలు, జంగయ్య సార్ కటింగ్ ఫిట్టింగ్ లు అంటు నవ్విస్తూ చెప్పే తెలుగు పాఠాలు నేటికీ గుర్తున్నాయి. మూర్తి సార్ వినాయక చవితి సందర్భంగా హిమాయత్ సాగర్ జలాశయం కట్టమీది నుంచి దూకితే వెనుకాల విద్యార్థులు దూకడం గుర్తుకొస్తున్నాయి. తెలుగు మాస్టారు అనంతరెడ్డి సార్ పద్యాలు చెప్పి అప్పగించకపోవడం తో చింత బరిగెలతో కొట్టడాలు, షా వలి (చాలి సార్) ఆప్యాయంగా ప్రేమతో చెప్పే క్లాస్ లు, భౌతిక శాస్త్రం చెప్పే మోహన్ రావు సార్ ఎం చెబుతున్నారో అర్థం కాక కామ్ గా క్లాస్ లో కూర్చున్న రోజులు గుర్తు కొస్తున్నాయి. రాజ్ గోపాల్ సార్ జీవ శాస్త్రం చెబుతూ పుప్పొడి, పర పరాగ సంపర్కము గురించి వివరించే విధానం నేటికి జ్ఞాపకం



1984-85 బ్యాచ్ 10వ తరగతి ఎ సెక్షన్ విద్యార్థులు ఆనాడు తీసుకున్న ఫోటో



బి సెక్షన్ విద్యార్థులు

ఉంది. ఆంజనేయులు సార్ కోపం, సామ్యేల్ సార్ ఇంగ్లీష్ పాఠాలు, రహీమ్ సార్, కమల టీచర్ హిందీ పాఠాలు జ్ఞాపకమొస్తున్నాయి. పీ ఈ టీ లుగా జాన్సన్ సార్, సుదర్శన్ సార్, గాబ్రియేలమ్మ టీచరు నేర్పించిన ఖో ఖో క్రీడలు మరచిపోలేని. అటెండర్ హాబీబ్ దుకాణంలో కొనుక్కుతినే తినుబండారాలు, మరో ఆటెండర్ నర్సింహ స్కూలు మొత్తం మాదే అన్నట్లు తీసుకునే భాద్యతలు మరిచిపోలేని. బి సెక్షన్ క్లాస్ మానిటర్ ఎం నాగభూషణం చెప్పే పాఠాలు, మిత్రుడు దివంగత జయరాజ్ క్లాస్ కు ఆలస్యంగా వస్తే భాస్కరమణి టీచర్ బొంబాయి సే ఆయే మేరా దోస్త్ అంటు వ్యంగ్యంగా మాట్లాడే మాటలు అన్నీ గుర్తుకొస్తున్నాయి.

### 9వ తరగతిలో నాగార్జున సాగర్, మాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శన అమోఘం :

తొమ్మిదవ తరగతిలో నాగార్జునసాగర్ ను తిలకించి నాగార్జున కొండకు బోటు లో వెళ్లడం, మాచర్ల సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శన నేటికీ గుర్తుకు వస్తున్నాయి. అదే సంవత్సరంలో గోల్కొండ కోట, టూంబ్స్ ను తిలకించడం సంతోషాన్నిచ్చింది.

### మరణించిన మిత్రులకు నివాళులు :

స్నేహితులంతా కలుసుకొని ఒక గ్రూపుగా ఏర్పడి సంతోషిస్తున్న సమయంలో మా మధ్య నుంచి దూరమై తిరిగిరాని లోకాలకు వెళ్లిన స్నేహితులు ఎం జయరాజ్ , ఎం బాలసుబ్రమణ్యం, చెన్నారెడ్డి, జి .యాదయ్య, నర్సింహ , ఎ. రాజు బాబు యాదవ్, వెంకటేశ్, ఎన్ వెంకటేష్ లతోపాటు ఉపాధ్యాయులు భాస్కరమణి టీచర్, సామెల్ సార్, రాజ్ కిషోరీ టీచర్, ఇలా మరికొందరు మా మధ్యలో లేకపోవడం బాధ వేస్తుంది. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తు...

మీరందరు గుర్తుకు వస్తున్నారు...... ఇంతకు బి సెక్షన్ లో నేను ఎక్కడున్నానో గుర్తు పట్టారా... నేనే చెబుతాను క్రింద నుంచి మూడో లైన్ లో ఎడమ వెట్కపు చివరన. చిన్నగా అమాయకంగా కనిపిస్తున్నానే అదే నేను.....

ఇట్లు,
మీ....
అప్పారెడ్డి గూడెం భీమయ్య,
10వ తరగతి బి సెక్షన్,
1984 - 85 బ్యాచ్,
రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల.



## పాత్రికేయులు రామకృష్ణ తల్లి లక్ష్మమ్మ దినకర్మ

### పలువురు రాజకీయ కుల సంఘాల నేతలు హాజరు

రాజేంద్రనగర్ ఫిబ్రవరి 25 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గం పాత్రికేయులు పోతురాజు రామకృష్ణ మాతృమూర్తి పోతురాజు లక్ష్మమ్మ,ఈనెల 10 వ తేదీన అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతు ఆరోగ్యం క్షిణించడంతో 16 వ తేదీ ఉదయం మృతి చెందింది. సోమవారం 24 వ తేదీన దినకర్మ మరియు సంతాప సభ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి బుద్వేల్ లోని తమ స్వగృహంబున నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మణికొండ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాల,వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కోరని బాల్ రాజ్, ఎమ్మార్పీఎస్ నేత వనం నర్సింహా మాదిగ,క్యాసారం శంకర్ రావు మాదిగ, ప్రేమావతి పెట్ గ్రామ జైభీమ్ జైరామ్ సంఘం సభ్యులు గోల్కొండ రాజ్ కుమార్, ఎడ్లకాడి సూర్యం, ఎడ్లకాడి అనిల్, అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరని ప్రసాద్,కోరని వరప్రసాద్ అడ్వకెట్,రాజేంద్రనగర్ డివిజన్ భాజపా అధ్యక్షుడు జి. బాబురావు,రాజేంద్రనగర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ రిపోర్టర్లు భుజంగరెడ్డి, వెంకట్,బాలమురళి కృష్ణ,సుజీవన్ రెడ్డి,నర్సింహా, రవికుమార్, బుచ్చన్న, సతీష్, నర్సింహా, గణేష్,రాజేష్, వెంకటేష్, విజయ్, పలువురు అధికారులు, హాజరై ఆమే చిత్ర పటం వద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రామకృష్ణ కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యాన్ని ఇచ్చారు. గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పోతురాజు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయించిన,ఓం సాయి భజన మండలి బృందం వారు ఎల్లమయ్య, శ్యామ్ కుమార్, అద్వర్యంలో ఆలపించిన గీతాలు అందరిని కంటతడి పెట్టించాయి.



వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్‌ను కలసి సన్మానిస్తున్న బీసీ ఉద్యోగులు

## వెటర్నరీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా బీసీకి అవకాశం ఇవ్వడం సంతోషకరం

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని పీవీ నర్సింహ్మారావు పశు వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ ను మం గళవారం బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు కలసి సన్మానించారు. వ్యవసాయ, వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు బీసీ శాస్త్రవేత్తలను వైస్ చాన్సలర్లుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నియమించడం సంతోషకరమన్నారు. వైస్ చాన్సలర్ ను సన్మానించిన వారిలో బీసీ ఉద్యోగుల సం ఘం నాయకులు బిక్షపతి, రమేశ్, దశరత్, సంతోష్ గౌడ్, సుదీప్ గౌడ్, మహేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లి సర్వారెడ్డి కాలనీలో చైన్ స్నాచింగ్

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) : శివరాంపల్లి సర్వారెడ్డి కాలనీలో నడుచుకుంటు వెళుతున్న ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగుటు రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ పెనుగులాటలో అర తులం గొలుసు అక్కడనే పడి పోగా ఒకటిన్నర తులం బంగారు గొలుసు చైన్ స్నాచర్లు తీసుకుని పారిపోయారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. శివరాంపల్లి కి చెందిన అన్నపూర్ణ (50) మంగళవారం సాయంత్రం సర్వారెడ్డి కాలనీ లో నివాసం ఉండే కూతురు దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుంది. బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించారు. ఆమె అడ్డుకోవడంతో అర తులం గొలుసు తెగి అక్కడ పడి పోగా ఒకటిన్నర తులం గొలుసును దుండగులు లాక్కెళ్లారు. దీంతో అన్నపూర్ణ 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయగా, అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్ డిగ్రీ చేయాలనుకుంటున్నారా

### దరఖాస్తు చేసుకోండి

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం): పబ్లిక్ హెల్త్ లో మాస్టర్ డిగ్రీ కోర్సు ప్రవేశాలకు మార్చి 16న హైదరాబాద్ లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. శ్రీ కాళోజీ నారాయణరావు వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల ఈ కోర్సు రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ లో నిర్వహిస్తారు. ఈ కోర్సు ప్రవేశానికి ఏదేని డిగ్రీలో 50శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష రాయదలుచుకున్న వారు మార్చి 3వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తమ దరఖాస్తులను ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఐఐపీహెచ్ పరిపాలన విభాగం అసిసెంట్ మేనేజర్ టీవీ శివనాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సు చేయడానికి వయోబేధం లేదన్నారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతకు షెడ్యూల్ కులాల వారికి 30శాతం, వెనుకబడిన కులాల వారికి 40శాతం మార్కులు వస్తే చాలన్నారు. ఇతర వివరాలకు కీఠికి జీజీఇజి.ఓజలో సంప్రదించాలన్నారు.

## వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న బోధన సిబ్బందికి జీవో నెంబర్ 3ను వర్తింపచేయాలి

**బుద్వేల్ ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 3 ప్రకారం యూనివర్శిటీ ఫ్యాకల్టీ రిటర్మెంట్ వయసు 60 నుంచి 65కు పెంచడం జరిగిందని, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన విశ్వవిద్యాలయాల బోధన సిబ్బందికి కూడా ఈ జీవో ను వర్తింపచేయాలని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్ కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలన్నారు.**

## కొత్త సవాళ్ళని ఎదుర్కొనేలా విద్యా వ్యవస్థ మారాలి

### వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆల్దాస్ జానయ్య



సమావేశంలో పాల్గొన్న వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య

బుద్వేల్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం): మారుతున్న సామాజిక,ఆర్థిక పరిస్థితులు, పట్టణీ కరణ ,వాతావరణ మార్పులు, కుటుంబ,వ్యక్తిగత పరిస్థితుల కారణంగా అనేక కొత్త సవాళ్ళు ఎదురవుతున్నాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆల్దాస్ జానయ్య అన్నారు.వాటిని ఎదుర్కొనే విధం గా ప్రస్తుత విద్యా వ్యవస్థ లేదని ఆయన అభిప్రాయపడ్డారు.వ్యక్తి సంతులన జీవితం సాగించే విధానాలు అలవర్చుకునేలా విద్యావ్యవస్థ మారాలని ఆయన సూచించారు.ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ అడ్వాన్సుడ్ ఫాకల్టీ ట్రైనింగ్ ఇన్ కమ్యూనిటీ సైన్స్,పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ సెంటర్ 21 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించి ముఖ్య అతిథి ప్రసంగం చేసారు.మానసిక మరియు పోషకాహార నాణ్యతలు, వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం అన్న అంశంపై నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం లో వివిధ రాష్ట్రాల వ్యవసాయ,ఉద్యాన విశ్వవిద్యాలయాల బోధన సిబ్బంది పాల్గొంటున్నారు. ఏ వృత్తి లో ఉన్న వారైనా నిత్యం నేర్చుకునే అలవాటు కలిగి ఉండాలని జానయ్య అన్నారు.తమ విశ్వవిద్యాలయం లోని సిబ్బందికి కూడా స్వల్పకాలిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.అందుకే విశ్వవిద్యాలయంలో తొలిసారిగా సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్‌ని ఏర్పాటు చేసామని తెలిపారు.మనిషి తమ బాధ్యతలు నిర్వర్తించుకుంటూ పోతే అవకాశాలు వాటి అంతట అవే వస్తాయనీ,ఎక్కువ అంచనాలు పెట్టుకుంటే అవి నెరవేరకపోతే నిరాశే మిగులుతుందున్నారు .లక్ష్యాలు ఏర్పర్చుకొని వాటి సాధనకి కృషి చేయాలన్నారు.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుప్పకూలిపోవడం వల్ల కూడా నేడు సమాజం లో అనేక సమస్యలు తలెత్తున్నాయని వివరించారు. నేటి ఆధునిక సమాజం లో వివిధ రకాల మానసిక ఒత్తిళ్ళకి ఇటు యువత అటు ఉద్యోగులు గురి అవుతున్న నేపథ్యంలో వ్యక్తిగత వికాసాన్ని మరియు మానసిక స్థైర్యాన్ని పెంపొదించే విధంగా ప్రాథమిక విద్య నుంచే కొన్ని పాఠ్య అంశాలని చేర్చాల్సిన అవసరం ఉందని జానయ్య అభిప్రాయపడ్డారు. అదే విధంగా దేశం లో ఆహార నాణ్యత కి పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వల్ల కల్తీ ఆహారం దైనందిన జీవితం లో భాగం అయింది అని, దీనిని అరికట్టకపోతే ముమ్మందు మానవ వనరుల నాణ్యత పై తీవ్ర ప్రభావం ఉంటుందని జానయ్య అన్నారు.ప్రస్తుతం ఆహార భద్రత ,రహదారి భద్రత లకి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయని వీటిని అధిగమించడం పై దృష్టి సారించాలని ఆల్దాస్ జానయ్య సూచించారు.మనిషి జీవితంలో ఫుడ్,మూడ్ లు అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయని కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌గా పాల్గొని ప్రసంగించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ హెల్త్ సైకాలజీ,స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ జి.పద్మజ అన్నారు.ప్రస్తుతం మనుషుల జీవిత కాలం పెరుగుతున్నప్పటికీ జీవితాల్లో నాణ్యత కొరవడిందన్నారు.మొబైల్ ఫోన్ వల్ల సమాచారం అధికంగా అందుబాటులోకి వచ్చి మనుషులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని వివరించారు.డిప్రెషన్,యాంక్సైటీ వంటి పదాలని ప్రతి సందర్భానికి వాడటం సరికాదన్నారు.మెరుగైన సామాజిక జీవనం కోసం ఆహారం,మానసిక ఆరోగ్యం ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరముందని పద్మజ అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు,బోధనేతర సిబ్బంది కూడా అనేక ఒత్తిళ్ళకి గురి అవుతున్నారని విశ్వవిద్యాలయ కమ్యూనిటీ సైన్స్ ఫాకల్టీ డీన్ డాక్టర్ వి.విజయలక్ష్మి అన్నారు.వాటిని ఎదుర్కొనేందుకు ఇటువంటి శిక్షణా తరగతులు తోడ్పడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది,కోర్సు నిర్వహణ బాధ్యులు డాక్టర్ పి.శ్రీదేవి,డాక్టర్ టి.సుప్రజ,డాక్టర్ పి.జానకీ శ్రీనాథ్,డాక్టర్ జి.స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.ఈ ప్రారంభ కార్యక్రమం విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజ్ మెంట్ సెంటర్ హాల్‌లో జరిగింది.

## మహా శివరాత్రి పూజలు ప్రారంభం



గణపతి హెూమంలో పాల్గొన్న ప్రణవ భక్త సమాజం సభ్యులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్‌లు

బుద్వేల్, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం): అత్తాపూర్ రాంబాగ్ శ్రీ చిన్న అనంతగిరి శివాలయం లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో మం గళవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఉదయం 4గంటలకు సుప్రభాత సేవ, గణపతి హెూమం, అమ్మవారికి అభిషేకాలు, స్వామి వారికి పూజలు నిర్వహించారు. గణపతి హెూమం అనంతరం శ్రీ ఉమా మహేశ్వరీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. నవగ్రహ విశేష పూజలు చేశారు. సాయంత్రం 6గంటలకు ప్రణవభక్త సమాజం సభ్యులచే గీతా పారాయణం నిర్వహించారు. భజన కార్యక్రమాలను చేపట్టారు.

### రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ సందర్శన :

రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు బుధవారం యాభై వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని ప్రణవ భక్త సమాజం సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఉండటానికి కావాల్సిన పోలీస్ బందోబస్తును రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ రాజేందర్ గౌడ్ వాహనాల పార్కింగ్ గురించి ప్రణవభక్త సమాజం సభ్యులచే మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ జాగ్రత లు తీసుకుంటామని తెలిపారు. పూజా కార్యక్రమాలలో ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మోంద్ర నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, సనివెల్లి క్రిష్ణ, బర్ల మల్లారెడ్డి, ఎస్బీ హరినాథ్. కొండమీది హరినాథ్, నారగూడెం మల్లారెడ్డి, మోంద్ర కొమురయ్య, మ్యాడం మధు సూదన్, షాబాద విజయ్ కుమార్ , మోంద్ర ఐలయ్య. ఎస్.జయానంద్ రెడ్డి, ఎం.బాలు, శ్రీకాంత్, సుధాకర్ రెడ్డి, మ్యాడం రాము, సోమారం సురేశ్, ఎల్.వెంకటేశ్, షాబాద ఆనంద్, రావుల గం డయ్య, రావుల జగన్, ఎం.రాజు, కె.ప్రసాద్, ఇ.సహదేవరెడ్డి, ఎస్.రమేశ్, బి.దయాకర్ లు పాల్గొన్నారు.

### వివిధ దేవాలయాలలో..

రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం, బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామీ దేవాలయం. పద్మశాలిపురం కేదారేశ్వర స్వామీ దేవాలయు, ప్రగతి కాలనీ పంచాయతన శక్తీ పీఠం తదితర ప్రాంతాలలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



విజేతలతో వెటర్నరీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

### వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాష్

బుద్వేల్, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం): విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణిస్తూ దేశం గర్వించే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జ్ఞాన ప్రకాష్ పిలుపునిచ్చారు. పశువైద్య విశ్వవిద్యాలయంలో శనివారం ప్రారంభమైన మూడవ ఇంటర్ కాలేజియేట్ క్రీడా, సాహితీ , సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి డాక్టర్ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సరి సమానంగా క్రీడల్లోనూ రాణించాలన్నారు . క్రీడల వలన వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం మెరుగువుతుందని తెలియజేశారు. బోధన బోధనేతర సిబ్బందికి కూడా క్రీడలు పని ఒత్తిడిని దూరం చేసే మెడిసిన్ వలే పనిచేస్తాయని, నిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరక మానసిక దృఢత్వం పెరిగి దీర్ఘకాలిక వ్యాధులు దరిచేరబోవని అన్నారు. ప్రతి సంవత్సరం ఈ క్రీడలను క్రమం తప్పకుండా నిర్వహించడానికి కృషి చేస్తానని ఉపకులపతి గారు హామీ ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులనుందించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ వివిధ కళాశాలల నుండి ఈ స్పోర్ట్స్ మీట్ కి విచ్చేసి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులను , అధ్యాపకులని అభినందించారు. ప్రతిరోజు చదువుతోపాటు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించడం వలన మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందిస్తాయని తెలియజేశారు.విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు అధ్యాపకులకు ఈ స్పోర్ట్స్ మీట్ ఎన్నో మధురానుభూతుల్ని మిగిల్చిందని తెలియజేశారు. ఈ క్రీడల్లో విద్యార్థులు ప్రదర్శించిన స్పోర్ట్స్ మ్యాన్షిప్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఓడిపోయిన విద్యార్థులు నిరుత్సాహ పడకుండా అసలు క్రీడల్లో పాల్గొనడమే మొదటి విజయం అని పిలుపునిచ్చారు. ఈ క్రీడల్లో పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్, మామునూరు, కోరుట్ల, కామారెడ్డి మరియు పెబ్బేరు కళాశాలల నుండి 250 విద్యార్థినీ విద్యార్థులు 100 బోధన సిబ్బంది మరియు 75 బోధినేతర సిబ్బంది పాల్గొనున్నారు. రాజేంద్రనగర్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ క్రీడలు విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి మరియు మీడియా మిత్రులకు విశ్వవిద్యాలయాధికారులు, పశువైద్య కళాశాల అసోసియేట్ న్ డాక్టర్ మాధురి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక



# రైల్వే బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం)నియోజకవర్గంలో రైల్వే క్రాసింగ్ ల వద్ద ఏర్పాటు చేయవలసిన బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు , రైల్వే స్థలంలో నుండి ఏర్పాటు చేయవలసిన రోడ్లు , డ్రైనేజ్ వ్యవస్థల గురించి సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి. సికింద్రాబాద్ రైల్ నిలయంలో చీఫ్ ఇంజనీర్ మల్లిఖార్జున్ డి.ఆర్.ఎం లోకేష్ విశ్నోయ్ లను కలిసి పలు అంశాల పై సమీక్షించిన ఎమ్మెల్యే మచ్చ బొల్లారం డివిజన్ జనప్రియ వద్ద ఇదివరకే ఎమ్మెల్యే ప్రతిపాదించిన ఆర్.యు.బి. కై నిధులు మంజూరు చేయాలని, కొత్తబస్తీ లోని నాలా ప్రవాహానికి అడ్డుగా ఉన్న రైల్వే టన్నెల్ ను తొలగించి పెద్ద టన్నెల్ ను ఏర్పాటు చేస్తే ప్రవాహం పెరుగుతందని, అదే విధంగా ఆర్.కే.పురం ఫ్లైఓవర్ పై ట్రాఫిక్ రద్దీ పెరగడంతో తన చొరవతో అదనపు బ్రిడ్జీల నిర్మాణం కోసం మంజూరైన 245 కోట్ల నిధులతో ఆర్ కే పురం వద్ద అదనపు ఫ్లైఓవర్ పనుల నిర్మాణం త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. మౌలాలి జెడ్.ఆర్.టీ.ఐ గ్రౌండ్ సమీపంలోని హనుమాన్ నగర్ హిల్ ఏరియాలో డ్రైనేజ్ వ్యస్థ ఏర్పాటుకు రైల్వే స్థలం ఇవ్వాలని ఎమ్మెల్యే గారు రైల్వే అధికారులను కోరగా సానుకూలంగా స్పందించిన చీఫ్ ఇంజనీర్ , అలాగే గౌతమ్ నగర్ ఆర్.యు.బి . నిర్మాణానికి కావలసిన అన్ని అనుమతులను రైల్వే శాఖకు అందించామని, నిర్మాణ పనులు మొదపెట్టాలని చీఫ్ ఇంజనీర్ మరియు డి.ఆర్.ఎం లను ఎమ్మెల్యే కోరారు ఈ కార్యక్రమంలో బద్దం పరశురామ్ రెడ్డి, జగదీష్ గౌడ్, డోలీ రమేష్, అనిల్ కిషోర్,మధు సుధన్ రెడ్డి, చిన్న యాదవ్, శోభన్ బాబు, సాయి గౌడ్, ఉష శ్రీ, పవన్, ప్రశాంత్ రెడ్డి, సంతోష్ గుప్త తదితరులు ఉన్నారు.



## సమగ్ర శిక్షణ అభియాన్,

# ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సబ్జెక్ట్ మేళా

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) విద్యార్థుల్లో ఆలోచనలు, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వినూత్న బోధన చేపట్టేందుకు సబ్జెక్ట్ మేళా ఎంతో దోహపడుతుందని మల్లాపురం తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు కె.వరలక్ష్మి అన్నారు. కేటిదొడ్డి మండలం మల్లాపురం తండా ఎంపిపీఎస్ లో హెచ్ఎం వరలక్ష్మి అధక్షతన సమగ్రశిక్షణ అభియాన్ మరియు ఎంవిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ... పిల్లలకు నేర్పిస్తే ఏదైనా నేర్చుకోగలరని, పిల్లలలో సృజనాత్మకత మరియు నైపుణ్యాలు కలిగి ఉంటారు అని అన్నారు. ఈ సబ్జెక్టు మేళాలో తెలుగు, గణితం, సామాన్య శాస్త్రము, ఇంగ్లీషు సబ్జెక్టుల వారీగా మూడో తరగతి నుండి ఏడవ తరగతి వరకు పిల్లలు వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియాలను ప్రదర్శించి వాటి గురించి వివరించడం జరిగింది. హెచ్ఎం వరలక్ష్మి మాట్లాడుతూ సబ్జెక్టు మేళా కార్యక్రమాల ద్వారా పిల్లలలో ఆలోచన శక్తి పెంచుతుందన్నారు. అదే విధంగా ఈ సబ్జెక్టు మేళా కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు హాజరై ప్రదర్శించిన మెటీరియల్ తల్లిదండ్రులు కూడా తిలకించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పిఎఫ్ సభ్యులు పాండు నాయక్, ధనుంజయ్, ఎంవీఎఫ్ ప్రాజెక్టు మండల ఇంచార్జ్ కిరణ్ కుమార్, మోబిలైజర్ రాకేశ్వరీ, మదర్స్ కమిటి సభ్యురాలు దివ్య అంగన్ వాడీ టీచర్ సుగుణ, అంభ్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.



## యూపీఎస్‌పై యుద్ధభేరి

# గోడపత్రిక ఆవిష్కరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం)పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి అని టీఎస్ సీపీఎస్ఈయూ రాష్ట్ర సహాధ్యక్షులు విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డి డిమాండ్ చేశారు. పాత పెన్షన్ సాధన కోసం యూపీఎస్ పై యుద్ధభేరి పోస్టర్ ను మంగళవారం మద్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా కేంద్రంలోని ఐడిఓసి ప్రాంగణంలో మార్చి 2 న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర నిర్వహించే భారీ బహిరంగ సభ గోడ పత్రికను టిఎస్ సీపీఎస్ఈయు సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ – గత పదేళ్ళ పోరాట ఫలితంగా గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని అన్నారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల చిరకాల వాంఛ అయిన ఓపియస్ సాధనకు అడుగు దూరంలో ఉన్న ప్రస్తుత తరుణంలో పాత పెన్షన్ ఆశలపై నీళ్ళు చల్లుతూ...రావణకాష్టంలా దూసుకువస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ రాష్ట్రంలోకి రానివ్వకుండా అడ్డుకోవాల్సిందే అని వారు అన్నారు. మార్చి 2 న హైదరాబాద్ లో ధర్నాచౌక్ వద్ద జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మన ఐక్యతను, ఆవేదనను , అక్రందనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాగార్జున గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాదిరి , తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే ఓపియస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఓపియస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో రిటర్మెంట్ అయ్యి సీపీయస్ ఉద్యోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. అంతేగాక యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కంటే పాత పెన్షన్ విధానం ద్వారా ఉద్యోగికి సామాజిక, ఆర్థిక భద్రత కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో సెంట్రల్ రాష్ట్ర కార్యదర్శి భీమన్న, జిల్లా క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ నరసింహ, జిల్లా సహాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, జిల్లా నాయకులు మురళి,జగన్, భద్రునిషా బేగం,అర్పిత , బిసి ఉద్యోగ సంఘం అధ్యక్షులు మదన్ మోహన్, శ్రీనివాసులు, భరత్, నరసింహ, వివిధ డిపార్ట్మెంట్ ఉద్యోగులు, ఉపాధ్యయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణవేణి జూనియర్ కళాశాల

# 27వ వార్షికోత్సవ సంబరాలు






గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) శ్రీ కృష్ణవేణి జూనియర్ కళాశాల 27వ వార్షికోత్సవ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కళాశాల గౌరవాధ్యక్షులు చాగాపురం నాగన్ గౌడ్ అధ్యక్షత వహించగా, జోగులాంబ గద్వాల జిల్లా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు ముఖ్యఅతిథిగా, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సీనియర్ మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయుడు, హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ కృష్ణ కుమార్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ తో పాటు కళాశాల డైరెక్టర్ శ్యామల , అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి హృదయ రాజు మాట్లాడుతూ... విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని ఈ కళాశాలలో అవి సమృద్ధిగా దొరుకుతాయని, 27 సంవత్సరాల పండుగను జరుపుకుంటున్న ఈ తరుణంలో నాకు పాల్గొనే అవకాశం దొరకడం తన అదృష్టమని, ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, రెవెన్యూ అధికారులుగా, పోలీసు అధికారులుగా , రాజకీయ నాయకులుగా కూడా ఎదిగారని ఇది క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన విద్యాసంస్థని కొనియాడడం జరిగింది. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయుడు ,హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ... తను చదివిన కళాశాలలో తాను అతిథిగా రావడం, మీతో గడపడం చాలా ఆనందంగా ఉందని ఈ కళాశాల ఇచ్చిన శిక్షణ , మార్గదర్శకాలే ఈరోజు నేను ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి దోహదపడ్డాయని, భవిష్యత్తులో ఇక్కడి విద్యార్థులు అందరూ కూడా నా మాదిరి ఈ వేదికపై అతిథులుగా వచ్చే స్థాయికి ఎదగాలని చెబుతూ హార్ట్ ఫుల్ నెస్ యొక్క ప్రాముఖ్యత, విద్యార్థులు దానిని ఉపయోగించుకొని ఏ విధంగా అభివృద్ధి చెందాల్లో తన శిక్షణ ద్వారా చూపించడం జరిగింది. ఆ తర్వాత జరిగిన సమావేశంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన రంగవల్లి నందు పాల్గొని గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేయడం జరిగింది. అంతేకాకుండా కళాశాలలో సేవలందించిన అధ్యాపకులకు, రెండవ సంవత్సరం పూర్తిచేసుకుని వెళుతున్న అన్ని గ్రూపుల విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక మేమెంటోలను అతిధులచే బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరము విద్యార్థిని విద్యార్థులు చక్కటి తమ కళా ప్రదర్శనలు నిర్వహించారు.

# మండలిలో వైసిపి, టిడిపిల మధ్య మాటల యుద్ధం

### గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంలో వైకాపా విమర్శలు తిప్పికొట్టిన మంత్రి లోకేశ్



అమరావతి, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) ఏపీ శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చర్చలో భాగంగా కూటమి, వైసీపీ ఎమ్మెల్సీల మధ్య రగడ చోటు చేసుకుంది. వాడీ వేడీ చర్చ జరగింది. అధికార పార్టీ తీరును ఎమ్మెల్సీ వదురు కళ్యాణి ఎండగట్టారు. హామీలు ఇచ్చి అమలు చేయలేదని, వలంటీర్లను తొలగించారని, ఇష్టం వచ్చినట్లుగా విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అలాగే ఉద్యోగాల కల్పన అంశంపై మండలిలో వైసీపీ.. టీడీపీ మధ్య మాటల యుద్ధం నడిచింది. గవర్నర్ ప్రసంగం అంశంలో తెలుగు.. ఇంగ్లీష్‌లో ప్రచురణల మధ్య తేడా ఉంది అంటూ గందరగోళం నెలకొంది. ప్రజలను ఇబ్బంది పెడుతూ సుపరిపాలన అని చెప్పడం కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ కల్యాణి ప్రశ్నించారు. గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని మండిపడ్డారు. నాలుగు లక్షల మంది ఉద్యోగాలు కల్పించామని స్పష్టంగా గవర్నర్ ప్రసంగంలో ఉందని వైసీపీ ఎమ్మెల్సీ అన్నారు.

దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. 'మేము ఉద్యోగాలు ఇచ్చామని ఎక్కడా చెప్పలేదు.. ఉద్యోగ అవకాశాలు కల్పించామనే చెప్పాం.. నియమించామని చెప్పలేదు' అని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు వాస్తవాలు మాట్లాడాలన్నారు. వాకౌట్ చేయొద్దని.. అన్నింటిపైనా చర్చిద్దామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం కావాలని అంటారు... మళ్ళీ ఇంగ్లీష్‌లో చెప్తే ఇబ్బంది అంటారని మంత్రి అన్నారు. గవర్నర్ ప్రసంగం తెలుగు అనువాదంలో తేడా ఉందని.. తప్పుంటే మార్చుకుంటామని చెప్పండి అని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీ ఎంపీలపై ఆధారపడి ఉందంటూ వైసీపీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను మంత్రి లోకేష్ తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు తెలిపామని స్పష్టం చేశారు. కేంద్రం మెడలు వంచి నిధులు తీసుకొస్తామని ఆనాడు పులివెందుల ఎమ్మెల్యే అన్నారని.. ఏమైందని అని ప్రశ్నించారు. ఐదేళ్లలో రాష్టానికి చేసిందేంటి అని వైసీపీని నిలదీశారు. ఆనాడు రాష్టాన్ని కాపాడాలని ప్రధాని మోదీని చంద్రబాబు, పవన్ కోరారని.. దానిలో భాగంగా ఇప్పుడు రైల్వేజోన్‌ను తీసుకొచ్చామని.. పోలవరం నిధులు, అమరావతికి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం ఏపీకి చాలా చాలా అవసరమన్నారు. ఎలాంటి కండిషన్లు పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు కోసం టీడీపీ, జనసేన చేరామని.. అన్‌కండిషనల్‌గా మద్దతు తెలుపుతామన్నారు. ఐదేళ్లలో వైసీపీ తీసుకురాని నిధులను.. తొమ్మిది నెలలో రాష్టానికి తీసుకొచ్చామన్నారు. అలాగే వైసీపీ నేతలకు కూడా మంత్రి స్టాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడి చేశారో వారిని వదిలే ప్రసక్తే లేదని.. మార్క్ మై వర్డ్స్ అంటూ హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో ఇంగ్లీష్ మీడియంపై రగడ చోటు చేసుకుంది. ఇంగ్లీష్ మీడియం లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎలా వస్తాయని వైసీపీ ఎమ్మెల్సీ మాధవ్ ప్రశ్నించగా.. హోంమంత్రి అనిత ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు తెలుగును అవమానిస్తున్నారని మండిపడ్డారు. తెలుగు మీడియంలో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానానికి వెళ్లారని.. ఆ విషయం వైసీపీ ఎమ్మెల్సీలకు తెలియదా అంటూ మండిపడ్డారు. వెంటనే వైసీపీ సభ్యులు తమ మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మంత్రులు గొట్టిపాటి, డోలా బాలవీరాంజనీయ స్వామి,తదతరులు కూడా వైసిపి అతస్యాల ప్రచారాన్ని ఖండించారు. అయితే మంత్రులు పదేపదే లేచి అడ్డుకోవడంపై ఛైర్మన్ మోషెస్ రాజు అభ్యంరతం వ్యక్తం చేశారు.



# ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి25(ప్రభాత ఉదయం) ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. గ్రామ పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరైన పనులకు సంబంధించి ఎస్టిమేషన్ విధానం, పనుల అమలు, చెల్లింపు వివరాలను సమీక్షించి అన్ని వివరాలు ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు హరితహారం కింద నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల వివరాలు, వాటి నిర్వహణకు జరిగిన ఖర్చులను సమీక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్ క్రింద అవసరమైన మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ నిధుల్లో 60% వ్యవసాయ అనుబంధ పనులకు కేటాయించాలన్నారు. మెజర్‌మెంట్ బుక్, మస్టర్ రోల్‌ను పరిశీలించి,అన్ని రిజిస్టర్లు స్పష్టంగా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ కింద చేపట్టిన అన్ని పనులను ఆన్లైన్‌లో నమోదు చేయడంతో పాటు, పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయంలో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపుదల కోసం రూ. 30 వేలతో నిర్మిస్తున్న ఇంకుడు గుంత పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఎంపీడీఓ అజార్ మొహిముద్దీన్, ఏపీఓ శివ జ్యోతి, టీఏలు కృష్ణయ్య, లావణ్య, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి

# గుడిమల్కాపూర్ సంగీత, నృత్య కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు:

### అన్నమాచార్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ కే వరలక్ష్మి

### పరీక్ష ఫీజు చెల్లించటానికి మార్చి మూడు గడువు పెంపు

మెహదీపట్నం, ఫిబ్రవరి 25(ప్రభాత ఉదయం) ఏడాది నుండి సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను మెహదీపట్నంలోని గుడిమల్కాపూర్‌లో గల అన్నమాచార్య ప్రభుత్వ, సంగీత, నృత్య కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని విశ్వవిద్యాలయం అనుమతించిందని ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ కే వరలక్ష్మి తెలిపారు. కళాశాలలో ఈ ఏడాది నుండి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయము రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ కోర్సులకు మార్చి మూడో తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించటానికి విశ్వవిద్యాలయం అనుమతించిందని ఆమె పేర్కొన్నారు. సర్టిఫికెట్ కోర్సుకు 4500 రూపాయలు, డిప్లొమా కోర్సు కు 4800 రూపాయల ఫీజు చెల్లించి కళాశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు. సంగీత, నృత్య కోర్స్ చదువుకునే విద్యార్థులందరికి అందుబాటూల్ ఉండే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుక్ను రిజిస్టార్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంచాలకులు, సాంస్కృతిక శాఖ అధికారులకు అన్నమాచార్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ కే వరలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608